## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో అభ్యంతరాలు లేని భూములను వీలైనంత త్వరగా క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- మానసిక వికలాంగుల విషయంలో ఆప్యాయతతో వ్యవహరించాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్ర సేన రెడ్డి పేర్కొన్నారు.
- తిరుమలలో ఈ నెల 24 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వ స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.
- ఒకరోజు పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి రేపు విశాఖపట్నం రానున్నారు.

==========================

రాష్ట్రంలో అభ్యంతరాలు లేని భూములను వీలైనంత త్వరగా క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, భూములు, ఆదాయార్జన శాఖలపై రెండవ రోజు కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెవెన్యూ విభాగానికి వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం మేర భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. రీసర్వే చేసి రికార్డులను సరి చేయాలని సూచించారు. కులం ధృవీకరణ పత్రాలను శాశ్వత ప్రాతిపదికన ఇవ్వాలని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 2.0 సంస్కరణల వల్ల రాష్ట్ర ప్రజలకు 8 వేల కోట్ల రూపాయల మేర ప్రయోజనం ప్రతీ ఏటా కలుగుతుందని చంద్రబాబు నాయుడు తెలిపారు. పన్నుల తగ్గింపు ప్రయోజనాలపై ఈ నెల 22 నుంచి అక్టోబరు 22 వరకూ ప్రజలలో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రెవెన్యూ శాఖలో రెండు నెలల్లో నూరు శాతం ఫైళ్లు అన్నీ ఆన్ లైన్ లో ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ జిల్లా కేంద్రాలు అక్టోబర్ చివరినాటికి సిద్ధం అవుతాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

మానసిక వికలాంగులు చిన్న పిల్లల మనస్తత్వం కలిగి ఉంటారని, వారికి అప్యాయతను అందించాల్సిన అవసరం ఉందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్ర సేన రెడ్డి అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ శివారులో స్థాపించిన మానసిక వికాస కేంద్రాన్ని ఆయన ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ... మానసిక పరిస్థితి బాగులేని వారి విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వారి మానసిక రుగ్మతలను గుర్తు చేసేలా వ్యవహరించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు.

===========================

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ లండన్ లో పర్యటిస్తున్నారు. నవంబర్ 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న CII పార్టనర్‌షిప్ సమ్మిట్ - 2025 సన్నాహాల్లో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశం ఉన్న రంగాల గురించి అక్కడి పారిశ్రామికవేత్తలకు తెలియచేసేందుకు మంత్రి నారా లోకేష్ లండన్ పర్యటన దోహదపడనుందని అధికారులు పేర్కొన్నారు. లండన్ పాల్ మాల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ వేదికగా ఈ రోజు జరిగే కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ ప్రపంచ వ్యాపార దిగ్గజాలతో చర్చిస్తారని అధికారులు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన వ్యాపార పారిశ్రామిక ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని వారు వెల్లడించారు.

విరామం

===========================

సేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం "సేవా పర్వ్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా ఈరోజు పునరుత్పాదాక ఇంధన శక్తి కోసం భారత్ అమలు చేస్తున్న పలు పథకాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 150 సెకన్లు)

===========================

తిరుమలలో ఈ నెల 24 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. ఆయన అధ్యక్షతన తిరుమలలోని అన్నమయ్య భవన్ లో ఈ రోజు జరిగిన పాలకమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ మాట్లాడుతూ... ఈ నెల 23న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని చెప్పారు. 24న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని బి.ఆర్.నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

===========================

ఒకరోజు పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు రేపు విశాఖపట్నం రానున్నారు. ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి నుండి ప్రత్యేక హెలికాప్టర్ లో బయలుదేరి 11 గంటల 15 నిమిషాలకు విశాఖలోని బీచ్ రోడ్డులో గల కోస్టల్ బ్యాటరీ హెలిపాడ్ కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. స్థానికంగా జరిగే ఉమన్ అండ్ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

===========================

దక్షిణ కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉత్తర-దక్షిణ ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజులలో ఉత్తర కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలిపారు.

===========================

===========================